క్లుప్తంగా

రామకోటిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



ఆయుర్వేద శిబిరంలో వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ నగేష్

ఏలూరు (టూటౌన్) : స్థానిక వన్‌టౌన్‌లోని రామకోటి ప్రాంగణంలోని డాక్టర్ మునగ రామ మోహనరావు కళావేదికపై లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు అధ్యక్షతన శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు టీవీఎం నగేష్, సిబ్బంది ఆధ్వర్యంలో 118 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్ కుమార్, వనిమిశెట్టి రామారావు, జన్నా వెంకటరామయ్య, పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు, వైద్యులు

ఏలూరు టౌన్: ఏలూరు జీజీహెచ్‌లో లెప్రసీ బాధిత కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రూ.8 వేలు చొప్పున ముగ్గురికి ఆర్థిక సాయం అందజేసినట్టు లెప్రా సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త రాధిక తెలిపారు. ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్, మైక్రోబయాలజీ హెడ్ ప్రొఫెసర్ ఎం.శశిధర్, జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసు చేతుల మీదుగా విద్యార్థులకు ఆర్థిక సాయం చెక్కుల రూపంలో అందజేశామన్నారు. తెనాలి డబుల్ హార్స్, లెప్రా సొసైటీ సంయుక్తంగా ఏలూరులో కుష్టురోగుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, డీపీఎంఓ కె.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మంచి ప్రవర్తనతో ముందుకు సాగాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బుద్ధుడు చెప్పిన విధంగా బుద్ధం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి అనే నినాదంతో మంచి ప్రవర్తనతో ముందుకు సాగాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1956 అక్టోబరు 14 విజయదశమి రోజున లక్షలాది మంది అనుచరులతో కలిసి నాగపూర్‌లో బౌద్ధం తీసుకున్న సందర్భానిన పురస్కరించుకుని స్థానిక నరసింహారావుపేటలోని ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర దళిత మహాసభ ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, నాయకులు పల్లా యేసేబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో నవరత్నాల వెలుగు

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పాలన పేదల బతుకుల్లో నవరత్నాలుగా మారిందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 114వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం ఏలూరు వన్‌టౌన్‌లో 5వ డివిజన్‌లో కార్పొరేటర్ గరికపూడి ఇమ్మానుయేల్ జయకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులను ఆరా తీశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి దిశగా పయనిస్తోందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఏలూరు నగరంతోపాటు, విలీన గ్రామాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఏలూరులో ప్రజలకు శుద్ధిచేసిన తాగునీటికి రూ.129 కోట్ల అమృత్ నిధులను వెచ్చిస్తున్నామని తెలిపారు. ఏలూరు ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తే రాబోయే కాలంలో మరింత అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అర్బన్ తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేషన్‌ర్పో మూర్తి, కార్పొరేటర్లు, పార్టీ నేతలు ఉన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

కాపు కళ్యాణ మండపానికి 2300 గజాల స్థలం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కాపు సామాజికవర్గం అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, కాపుల్లోని పేదలకు సైతం మేలు చేకూరేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తెలిపారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఏలూరు ఐక్య కాపునాడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి కాపు సామాజికవర్గం ప్రముఖులు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాపు సామాజికవర్గం సమస్యలతోపాటు కాపులకు ఎన్నో ఏళ్లకలగా మిగిలిన కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి సహకరించాలని వినతి పత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే నాని స్పందిస్తూ ఏలూరు నియోజకవర్గంలో కాపు కళ్యాణ మండపానికి 2300 గజాల స్థలం మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోన్న వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలకు ఏటా రూ.15 వేలు అందిస్తూ అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో కాపు నేస్తం ద్వారా సుమారు రూ.9 కోట్లు కాపు అక్కాచెల్లెమ్మలకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే జమ చేశామని నాని తెలిపారు. కాపు సామాజికవర్గం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని చెప్పారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లోనూ కాపు వర్గాల నేతలకు సముచిత స్థానం కల్పిస్తోన్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని అన్నారు. కాపు కళ్యాణమండప నిర్మాణానికి స్థలం మంజూరు చేసిన ఎమ్మెల్యే నానికి కాపు నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుల సేవ పుణ్యకార్యం

ఏలూరు (టూటౌన్): వృద్ధులకు సేవ చేయడం పుణ్యకార్యమని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక ప్రేమాలయ వృద్ధాశ్రమాన్ని శనివారం మధ్యాహ్నం కలెక్టర్ దంపతులు సందర్శించారు. వృద్ధులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ అనాథ వృద్ధులకు తోడూనీడై ఆశ్రయం కల్పిస్తోన్న ప్రేమాలయం సేవలు ఎనలేనివన్నారు. వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు వస్తున్నాయా అని ఆరా తీశారు. అందని వారికి మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సోమశేఖర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రేమాలయం ప్రాంగణాన్ని కలెక్టర్ దంపతులు పరిశీలించారు. ఇక్కడి ప్రశాంత వాతావరణం ఆరోగ్యదాయకమని పేర్కొన్నారు. ప్రేమాలయం కమిటీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు టీవీ సుబ్బారావు, కార్యదర్శి మురళీ కృష్ణ, కమిటీ సభ్యులు చెన్న వెంకట్రామయ్య, ఆలపాటి నాగేశ్వరావు, గొర్ల రామారావు, కిరణ్, శేషగిరిరావు, చిత్రాలయ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, మానస దంపతులు







ఎస్సై పరీక్షలు ప్రారంభం

ఎస్సై మెయిన్స్ పరీక్షలు ఏలూరు నగరంలో మొదటి రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఏలూరులో పోలీస్ అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించారు. ఏలూరు సెయింట్ థెరిస్సా ఇంటర్ కాలేజీలో పరీక్షా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏలూరు ఎస్పీ డి.మేరిప్రశాంతి, సీఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసేందుకు వచ్చిన మహిళా, పురుష అభ్యర్థులు, హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది దృశ్యాలివీ.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

ఏలూరు రూరల్ : ఏలూరు ఆటో మొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఆటోనగర్ ఎన్నికల్లో జరిగిన ఘటనలకు తనకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ కాలం ఈ నెల 15తో ముగిసిందన్నారు. కొందరు ఎన్నికల్లో అక్రమంగా గెలుపొందాలనే దురాశతో ప్యానల్‌లో ఐదుగురు సభ్యుల నామినేషన్లను తిరస్కరించారని ఆరోపించారు. అసోసియేషన్‌లో 288 సభ్యులుండగా 312 మందికి చేర్చారని తెలిపారు. సంఘం బైలాకు విరుద్ధంగా ఏర్పడిన అడ్‌హక్ కమిటీ చెల్లదన్నారు. కొందరు వ్యక్తుల ప్రద్బోలంతో ఎన్నికల సమయంలో గలాట సృష్టించారని, దీంతో ఎన్నికలు నిలిచిపోయాయని వివరించారు. ఆటోనగర్‌లోని ఎమినిటీ సైట్‌పై అక్రమార్కుల కన్నుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.



మాగంటి నాగభూషణం

నూతన పీఆర్‌సీ కమిటీ పని ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాల్మన్ రాజు

ఏలూరు (టూటౌన్): పీఆర్‌సీ అమలు కోసం ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేస్తూ మూడు నెలల క్రితం జీఓ విడుదల చేసినప్పటికీ కమిటీ చైర్మన్ ఇప్పటికీ విధుల్లో చేరలేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు అన్నారు. స్థానిక ఇష్టా కార్యాలయంలో ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా సబ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ పీఆర్‌సీ నూతన కమిటీ వెంటనే పని ప్రారంభించాలని కోరారు. నూతన పీఆర్‌సీ జూలై, 2023 నుంచి అమలు కావాల్సి ఉండడంతో వెంటనే ఐఆర్‌ను మంజూరు చేయాలన్నారు. పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు టి.రామారావు, జేఎస్ శాస్త్రి, కె.కుటుంబరావు, పి.శ్యాంసుందర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు వి.గణేష్, ఏలూరు సంఘ నాయకులు ఎ.శ్రీనివాసరావు, ఎన్.నాగేశ్వరరావు, బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ కృష్ణ'లో ఉచిత వైద్యశిబిరం

ఏలూరు (టూటౌన్): సామాజిక సేవలో భాగంగా ప్రతి నెలా రెండో శనివారం తమ ఆస్పత్రి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నట్టు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బి.కృష్ణ తెలిపారు. తాను వైద్య వృత్తిలోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శ్రీ కృష్ణ ఆస్పత్రి ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 86 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశామని చెప్పారు. ఎక్స్‌రే, రక్త పరీక్షలు, బోన్ స్కానింగ్‌లను ఉచితంగా నిర్వహించామన్నారు. ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారని తెలిపారు. శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది, ఏలూరు స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్ నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు కృష్ణ

దోసగింజపై ప్రపంచ కప్



దోసగింజపై క్రికెట్ ప్రపంచ కప్

ఏలూరు (టూటౌన్): క్రికెట్ ప్రపంచ కప్ పోటీలను పురస్కరించుకుని ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు సురేష్‌బాబు ఒక సెం.మీ. పొడవైన దోస గింజపై వరల్డ్ కప్‌ను చెక్కి అబ్బుర పరిచారు. ప్రపంచంలోనే అతి సూక్ష్మమైన కప్‌గా ఈ చిత్రం నిలుస్తుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సురేష్ బాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో శనివారం పేదలకు అన్నదానం చేశారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పేదలకు అన్నదానం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు పాఠశాల సిబ్బంది తెలిపారు.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంపై శనివారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు నామమాత్రపు భక్తులతో దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వల్ప సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల విభాగాలు ఖాళీగా కనిపించాయి.